క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన మద్దిపాడు ఎస్సై


మద్దిపాడు ఎస్సై శివరామయ్య

మద్దిపాడు: మండల పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా 2014 బ్యాచ్‌కు చెందిన బి.శివరామయ్య సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఎన్నికల సమయంలో వీఆర్‌కి వెళ్లి.. ప్రస్తుతం వీఆర్ నుంచి మద్దిపాడు ఎస్సైగా నియమితులయ్యారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు శాంతిభద్రతలను పకడ్బందీగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

కరవది కాలేజీ విద్యార్థినికి ట్రిపుల్ ఐటీ సీటు


జాహ్నవికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్


ఒంగోలు రూరల్: మండలంలోని కరవది గర్ల్స్ జూనియర్ కాలేజీ విద్యార్థిని కొంగర జాహ్నవికి నూజివీడు ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీటు దక్కింది. ఈ సందర్భంగా కాలేజీలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, గ్రామ పెద్దలు జాహ్నవిని అభినందించి బహుమతి అందజేశారు.

విద్యార్థులకు మెరుగ్గా బోధించాలి


మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి సుబ్బారావు

ఒంగోలు: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలలో నేర్చుకున్న అంశాలతో విద్యార్థులకు మెరుగ్గా బోధించాలని ఉప విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు సూచించారు. సోమవారం స్థానిక రాంనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం ప్రతి ఉపాధ్యాయుడు ఈ ఏడాది 50 గంటల పాటు శిక్షణ పొందుతాడన్నారు. ఈ శిక్షణను విధిగా పొంది తరగతి గదిలో ఉపయోగించడం ద్వారా విద్యార్థుల అభ్యసన మెరుగుపరచాలన్నారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, ఎంఈవో–2 సరస్వతి, కార్యదర్శి కనకారెడ్డి, 60 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో సాగర్ నీరు వృథా


వృథాగా పోతున్న సాగర్ నీరు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో సాగర్ నీరు వృథాగా పోతోంది. గత కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మరో వైపు సైడు కాలువల్లోని మురుగుతో కలిసి సాగర్ నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వీఆర్వోపై కలెక్టర్ కు ఫిర్యాదు

కంభం: కందులాపురం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కందులాపురం వీఆర్వో ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం ఒంగోలులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్ తెలిపారు. కంభం– జంగంగుంట్ల మధ్యలో హైవే రోడ్డుపై ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా, ఇతర చోట్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా సదరు వీఆర్వో పట్టించుకోవడంలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

రాచర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య సోమవారం తనిఖీ చేశారు. గిద్దలూరు రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన జె.రామకోటయ్య మొట్టమొదటిసారిగా రాచర్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌తో పాటు పరిసరాలను, రికార్డులను తనిఖీ చేసి సూచనలు, సలహాలను ఇచ్చారు. ఆయన వెంట ఎస్సై ఇమ్మానియేల్, ఏఎస్సై ఆదిశేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కరవది చెరువు.. నీరు కరువు..!

- శతాబ్దాల చరిత్ర కలిగిన కరవది చెరువుకు నీరు నింపని అధికారులు
- కనీసం పరిశుభ్రం కూడా చేయక ముళ్ల పొదలు, నాచుతో నిండిన వైనం
- గుండ్లకమ్మ నదికి కూతవేటు దూరం
- చెరువు పక్క నుంచే వెళ్తున్న మల్లవరం పైప్‌లైన్
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగం


భూగర్భ జలాలు అడుగంటి గ్రామంలోని బోర్ నుంచి వస్తున్న మట్టి నీరు


నిరుపయోగంగా ఉన్న కరవది చెరువు

ఒంగోలు రూరల్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని కరవది చెరువుకు గ్రహణం పట్టింది. శతాబ్దాల చరిత్ర ఉన్నా.. చుట్టూ నీటి వనరులు ఉన్నా.. వ్యవస్థలోని లోపాలు ఈ చెరువుకు శాపాలుగా మారాయి. జలకళతో గ్రామస్తుల నీటి అవసరాలన్నీ తీర్చాల్సిన చెరువు నిరుపయోగంగా మారింది. ముళ్లచెట్లు, నాచుతో నిండిపోయి కళావిహీనంగా కనిపిస్తోంది. కరవది చెరువుకు కూతవేటు దూరంలోనే గుండ్లకమ్మ నది ఉంది. భారీ వర్షాల సమయంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. కానీ, గుండ్లకమ్మ నది నుంచి కరవది చెరువుకు నీరు నింపడంపై అధికారులు దృష్టి సారించిన దాఖలాలే లేవు. శతాబ్దాల నాడు ఆనాటి రాజులు, జమిందారులు కరవది గ్రామ భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 12 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఈ చెరువును తవ్వించారు. సౌత్ సెంట్రల్ రైల్వే లైన్లు మూడూ చెరువు పక్క నుంచే నిర్మించిన నేపథ్యంలో ప్రస్తుతం నికరంగా 12 ఎకరాల్లో చెరువు ఉంది. గతంలో చెరువు నిర్వహించడం కోసం వంశీకులాల వారిని నియమించి వారు కొంత భూమిని సేద్యం చేసుకునేలా హక్కు కల్పించినట్టు గ్రామ పెద్దలు చెబుతారు. ప్రస్తుతమైతే చెరువు మాత్రం గ్రామ సచివాలయం ఆధీనంలోనే ఉంది.

చెరువులో నిరుపయోగంగా సమ్మర్ స్టోరేజీ ట్యాంక్...

కరవది చెరువు మధ్యలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు కూడా ఏర్పాటు చేశారు. దానిని వినియోగించుకుని స్థానిక ప్రజలకు వేసవిలో సైతం నీటి కష్టాలు లేకుండా చర్యలు చేపట్టవచ్చు. కానీ, ఆ దిశగా అధికారులు ఏనాడూ ఆలోచించకపోవడంపై గ్రామ ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. చెరువు నిరుపయోగంగా ఉండటంతో ఏపుగా 15 అడుగుల ఎత్తున పిచ్చిచెట్లు, ముళ్లకంపలు, నాచు పెరిగింది. కనీసం వాటిని తొలగించి పరిశుభ్రం చేసింది కూడా లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెరువు కట్టపై ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ముఖ్యంగా ప్రజల్లోని దైవభక్తిని సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యక్తులు చెరువు కట్టను పూడ్చి కొన్ని నిర్మాణాలు చేపట్టారు. దీంతో రానురానూ చెరువు విస్తీర్ణం తగ్గుతోంది. చెరువులో నీరు అడగంటిపోవడంతో గ్రామంలో భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్ల నుంచి కూడా నీరు రావడం లేదని కరవదివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బావులు సైతం అడగంటిపోవడంతో.. కరవదిని నీటి కష్టాలు చుట్టుముట్టక ముందే అధికారులు స్పందించి కరవది చెరువును బాగుచేసి నీటితో నింపాలని కోరుతున్నారు. గుండ్లకమ్మ నది నుంచి, పైప్‌లైన్ల ద్వారా చెరువును పూర్తి స్థాయిలో నీటితో నింపితే.. సముద్రం పోటు నీరు వచ్చి ఉప్పు నీరు వినియోగించుకునే ఇక్కట్లు తమకు తప్పుతాయంటున్నారు. చెరువు కట్టపై దాతలు, పంచాయతీ వారు ఏర్పాటు చేసిన బోర్లు కూడా అడుగంటిపోకుండా ఉంటాయని చెబుతున్నారు.

అదేవిధంగా చెరువు కట్టను పటిష్టం చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుని కరవది చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోల్‌కతా డాక్టర్ ఘటనపై నిరసన వెల్లువ


స్త్రీ విముక్తి సంఘటన నిరసన ప్రదర్శన


ఆందోళన కార్యక్రమంలో భారీగా పాల్గొన్న విద్యార్థినులు

ఒంగోలు టౌన్: కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనకు నిరసనగా ఒంగోలులో పలు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమాలు కొనసాగించారు. సంబంధిత ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ స్త్రీ విముక్తి సంఘటన, జనసాహితి సంయుక్తంగా నిరసన ప్రదర్శన నిర్వహించాయి. స్థానిక ఈమని పాలెం నుంచి చర్చి సెంటర్, కలెక్టరేట్ మీదుగా నెల్లూరు బస్టాండు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనసాహితీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ కృష్ణయ్య మాట్లాడుతూ మద్యం, అశ్లీల సైట్లతో యువకులను తప్పుదోవ పట్టిస్తున్న పాలకుల దుర్నీతికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తే తప్ప ఇలాంటి దుర్మార్గాలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయలేమని అన్నారు. కోల్‌కతా ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న నాటకాలను స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి పి.శాంతాకుమారి తప్పుబట్టారు. ఏపీ రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి, డి.రేణుక, సాయి, పేరయ్య, రఘుబాబు, విజయసారధి, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

కదంతొక్కిన విద్యార్థినులు...

జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఘటన మరవకముందే దేశంలోని వివిధ ప్రాంతాల్లో వరుసగా అత్యాచారాలు జరుగుతుండటంపై విద్యార్థినులు మండిపడ్డారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు పెద్ద సంఖ్యలో సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. చర్చి సెంటర్‌లో మానవహారం అనంతరం ర్యాలీగా వెళ్లి జీజీహెచ్ ఆవరణలో జూనియర్ డాక్టర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు మద్దతు పలికారు. ఐద్వా నాయకురాలు కె.రమాదేవి, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, బండి వీరాస్వామి, కౌలు రైతు సంఘ నాయకులు వి.బాలకోటయ్య, సీఐటీయూ నాయకులు గంటెనపల్లి శ్రీనివాసరావు, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ హెల్త్ మెడికల్ యూనియన్ మద్దతు...

డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిపై నిత్యం జరుగుతున్న దాడులను నియంత్రించేందుకు కఠిన చట్టాలు తీసుకురావాలని యునైటెడ్ హెల్త్ అండ్ మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జూనియర్ వైద్యురాలి హత్యాచారంపై న్యాయం కోసం పోరాడుతున్న జూనియర్ డాక్టర్లకు యూనియన్ తరఫున ఆయన మద్దతు తెలిపారు. న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆపమని, జూడాలు చేస్తున్న పోరాటానికి పూర్తిగా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు టి.మహేష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ వద్ద గల రెడ్‌క్రాస్ భవనంలో ఫొటోగ్రఫీ పితామహుడు డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు దగ్గుపాటి వెంకట్రావు, కార్యదర్శి డి.చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రతినిధులు రసూల్, జెమినీ శ్రీనివాస్, మట్టా సత్యం, ఉదయ్ హరి, ఉప్పుటూరి చంద్ర, వెంకటేష్, సీహెచ్ భాస్కర్ నివాళులర్పించి ప్రసంగించారు. అనంతరం జిల్లా రెడ్‌క్రాస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాంటిస్సోరి ప్రకాష్ నిర్వహణలో సీనియర్ ఫొటోగ్రాఫర్లు ఎస్.బ్రహ్మారెడ్డి, అన్నపూర్ణ స్టూడియో శీను, డి.శ్రీనివాసరెడ్డి, కోట శ్రీనివాసరావు, మస్తాన్ నాయుడులను ఘనంగా సన్మానించారు. దగ్గుపాటి శివజ్యోతికుమార్, వెస్పా, సీహెచ్ పవన్‌కుమార్, సీహెచ్ మురళి, రాజశేఖర్, కామేష్, నాగేశ్వరరావు, కత్తి ప్రసాద్, ఇండ్ల సుబ్బారావు, సోనిక్ సుందర్, సీహెచ్ భార్గవ్, అశోక్, రమణ, మధుబాబు రక్తదానం చేశారు.

మీడియా కెమేరామెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

ఒంగోలు సెంట్రల్: అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మీడియా కెమేరామెన్ అసోసియేషన్ (ఎంసీఏ) ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొని ప్రారంభించారు. రక్తదానం చేసిన యువకులను అభినందించారు. జర్నలిస్ట్‌లకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని తెలిపారు. ముందుగా ఫొటోగ్రఫీ పితామహుడు డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మీడియా కెమేరామెన్ అసోసియేషన్ అధ్యక్షుడు వేల్పూరి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, బీజేపీ నగర అధ్యక్షుడు యోగయ్య యాదవ్, సూపర్‌బజార్ మాజీ చైర్మన్ తాతా ప్రసాద్, ఎంసీఏ మాజీ అధ్యక్షుడు ఇఫ్తేకర్‌బాషా, ప్రధాన కార్యదర్శి అచ్చుకాల రాజశేఖర్, కోశాధికారి ప్రతాప్‌రెడ్డి, ఏపీఈజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రి, హరి, లక్ష్మణ్, బాబి, మారుతి, బాబు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీహయగ్రీవ వికానసాచార్య జయంతి


స్వామివార్ల ప్రవచనంలో పరాంకుశ కేశవాచార్యులు

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లా వైఖానస సంఘం 35వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక మంగమూరురోడ్డులోని సంఘ స్థలం వద్ద సోమవారం శ్రీ లక్ష్మీహయగ్రీవ వికానసాచార్య స్వామివార్ల జయంతి మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ పూర్ణిమ రోజున సంఘ సభ్యులు స్వామివార్లకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించి తిరుమల తిరుపతి వేద విద్యార్థులు 30 మందికి మెరిట్ సర్టిఫికెట్లు, షీల్డు బహూకరించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా సంఘ అధ్యక్షుడు పరాంకుశం కేశవాచార్యులు, శ్రీమాన్ వాకాని రామకృష్ణ, శేషసాయి, టీటీడీ ఉపన్యాసకుడు, ప్రకాశం జిల్లా శ్రీ వైఖానస సంఘ ప్రధాన కార్యదర్శి పీఎంకే ఆత్రేయ, ఉపాధ్యక్షుడు పి.హరిబాబు, గౌరవాధ్యక్షుడు గంజం శ్రీనివాసు, మూర్తి, అడ్వైజర్ ఎంపీ శేషాచార్యులు, ప్రొఫెసర్ ఆర్ఆర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాల వినియోగం జరిగింది.

వైభవంగా స్వరరాగ రజతోత్సవం


విజ్ఞానానంద సరస్వతీ మాతాజీని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: స్వరరాగ రజతోత్సవంలో భాగంగా స్వర రాగ సుధ ఆధ్వర్యంలో శ్రీ కుందుర్తి చలపతిరావు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మంగమూరుడొంక గాయత్రి మందిరంలో సాయంత్రం ఐదు గంటలకు సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. సంగీత కళాకారులు పాల్గొని ప్రేక్షకులను అలరించారు. అనంతరం స్థానిక కేశవస్వామిపేట లలితా పీఠం నిర్వాహకులు మాతృశ్రీ విజ్ఞానానంద సరస్వతి మాతాజీని ఘనంగా సన్మానించారు.

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ, హిందూధార్మిక సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్న శ్రీగిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు రాధారమణగుప్తా జంధ్యం మాట్లాడుతూ స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతినెలా గిరి ప్రదక్షిణ పూర్తి చేసి శ్రీగిరిపై కొలువైన శ్రీనివాసుడిని దర్శించుకోవడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం శ్రావణమాసం శ్రవణా నక్షత్రం రోజున ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఏడాది పూర్తి చేసుకుని రెండో సంవత్సరంలోకి అడుగుపెట్టిందని తెలిపారు. సోమవారం శ్రవణా నక్షత్రం రోజును అత్యంత శుభదాయకమైన రోజుగా తెలిపారు. హయగ్రీవ జయంతి, రాఖీపూర్ణిమ, వైఖానస మహర్షి జయంతి.. ఇలా అతి ముఖ్యమైన రోజున స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని గిరిప్రదక్షిణ పూర్తి చేసిన భక్తులు తెలిపారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక శ్రీ బాపూజీ గో సంఘంలో శ్రీ గిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం నిర్వహించారు. పురోహితులు శాస్త్రోక్తంగా గాయత్రి మంత్రాన్ని పఠిస్తూ యజ్ఞోపవీతాన్ని ధారణ చేయించారు. అనంతరం శ్రీగిరి శ్రీనివాసుడిని దర్శించడానికి శ్రీగిరి గిరి ప్రదక్షిణ కొనసాగింది. ముందుగా గోపూజ చేశారు. శంకు, చక్రం, నామాలు, హనుమాన్ గరుడ చిత్రాలు, వేంకటేశ్వరుని ఉత్సవమూర్తితో గోమాత ముందు నడవగా గోవింద నామాలు చదువుతూ భక్తులంతా సామూహికంగా గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. కార్యక్రమంలో శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ సహకార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, సభ్యులు నల్లమల్లి కోటి సూర్యనారాయణ, చలువాది బ్రహ్మయ్య, దనిశెట్టి రామునాయుడు, నిర్వాహకులు భూమిరెడ్డి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలి



ధర్నా చేస్తున్న యానాదులు

ఒంగోలు టౌన్: సింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లె గ్రామం నరసింహస్వామికాలనీలో నివసిస్తున్న యానాదులకు శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ కోరారు. ఆ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 504లో 2.64 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉందని తెలిపారు. దానిపక్కనే 100 యానాదుల కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. గతంలో ప్రభుత్వం ఈ కుటుంబాలకు పట్టాలు ఇచ్చిందని, ఇప్పుడు ఖాళీగా ఉన్న 2.64 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని శ్మశాన వాటిక కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, యానాదుల గుడిసెల మీదుగా 33 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయని, దీని వలన తమకు ప్రాణహాని ఉందని, వాటిని తొలగించాలని కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన యానాదుల నాయకులు కోటేశ్వరమ్మ, చెంచయ్య, పద్మ, కృష్ణయ్య, రాఘవులు, మాణిక్యమ్మ, కత్తి చిన అంకమ్మ, అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్షుడు నాంచార్లు పాల్గొన్నారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంతో అవసరం


పీఈటీ సెంటర్ క్లాస్‌లో పాల్గొన్న పీఈటీలు, పీడీలు

- ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు

ఒంగోలు రూరల్: పాఠశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ అత్యంత అవసరమని ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు అన్నారు. స్థానిక త్రోవగుంట ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో పీఈటీలు, పీడీల తొలి సెంటర్ క్లాస్‌ను సోమవారం లాంఛనంగా ఎంఈఓ ప్రారంభించారు. సీనియర్ పీడీ, హైస్కూల్ హెడ్మాస్టర్ చల్లా బ్రాహ్మయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాయామం గురించి తెలియజేయాల్సిన విధానాన్ని వివరించారు. శరీర సౌష్టవానికి తీసుకోవాల్సిన ఆహారం, పాల్గొనవలసిన క్రీడలపై విద్యార్థులకు అవగాహన కల్పించి నేర్పించాలని సూచించారు. చల్లా బ్రాహ్మయ్య మాట్లాడుతూ పీఈటీలు, పీడీలు దేశవిదేశాల్లో క్రీడల్లో పాల్గొన్నారని తెలిపారు. పతకాలు సాధించిన వారిని బ్రహ్మయ్య తన సొంత నిధులతో ఘనంగా సన్మానించారు. అనంతరం పీఈటీల మధ్య పలు క్రీడా పోటీలను స్నేహపూరిత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల పీఈటీ హజీరాబేగం, ప్రసాద్‌లను సన్మానించారు.

ఘనంగా రాఖీ వేడుకలు

ఒంగోలు: రాఖీ పండుగను సోమవారం సోదరీ సోదరీమణులు ఘనంగా జరుపుకున్నారు. అన్నాతమ్ముళ్లకు అక్కాచెల్లెల్లు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి వారి అనుబంధాన్ని చాటుకున్నారు. పరస్పరం కానుకలు అందజేసుకున్నారు. స్థానిక మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో కాలేజ్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ వై.సత్యన్నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా ప్రచారక్ మనోజ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.రాజేంద్రబాబు, టి.రాజశేఖరరెడ్డి, ఎస్‌కే నిరోషా, ఎం.సౌమ్య తదితరులు పాల్గొన్నారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధనిశెట్టి రాము పావని దంపతులకు రాఖీ కట్టి వేడుకలు ప్రారంభించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బి.విజయరావు, తదితరులు పాల్గొన్నారు.